ప్రశ్నించడం కోసం...?

RNI NO. TELTEL/2023/90455

# మన ప్రజాప్రతినిధి

ప్రజా ప్రతినిధి NEWS టీ.వి

తెలుగు దిన పత్రిక

ఎడిటర్: జి. శ్రీనివాస్ సంపటి : 3 సంచిక :110 శనివారం ఫిబ్రవరి 14 2026, పేజీలు - 4 వేల : 2/-

epaper.manaprajaprathinidhi.com

PUBLISHED FROM: TELANGANA / ANDHRAPRADESH

## పుల్వామా అమర వీరుల స్మరణ దినం



✦ దేశ రక్షణలో అర్పించిన అమూల్య ప్రాణాలకు వినమ్ర నివాళి

✦ త్యాగం, ధైర్యం, సేవ భావానికి చిరస్థాయి స్మారకం

ఫిబ్రవరి 13 (మనప్రజాప్రతినిధి): దేశం సురక్షితంగా నిద్రపోవాలంటే సరిహద్దుల్లో ఎవరో మేల్కొని ఉండాలి. ఆ బాధ్యతను నిశ్శబ్దంగా భుజాన వేసుకునే వారు మన జవాన్లు. తమ కుటుంబాలను, వ్యక్తిగత ఆశలను, సౌకర్యాలను పక్కనపెట్టి దేశ రక్షణ కోసం అహర్నిశలు శ్రమించే వారి సేవ అమూల్యం. అలాంటి వీర జవాన్ల త్యాగాన్ని స్మరించుకునే రోజే పుల్వామా అమర వీరుల స్మరణ దినం. ఈ రోజు కేవలం ఒక ఘటనను గుర్తు చేసేది కాదు. దేశభక్తి, అంకితభావం, ధైర్యసాహసాలకు ప్రతీకగా నిలిచిన అమరుల జ్ఞాపకాలను మళ్లీ మన ముందుకు తెస్తుంది. పుల్వామా ఘటన దేశాన్ని ఒక్కసారిగా కుదిపేసింది. విధి నిర్వహణలో ఉన్న జవాన్ల ప్రాణాలు కోల్పోయిన ఆ విషాద సంఘటన ప్రతి భారతీయుడి హృదయాన్ని కదిలించింది. ఆ రోజు దేశం ఒక్కటైంది. వేదన, ఆగ్రహం, గౌరవం భావాలు కలిసిపోయాయి. అమరుల కుటుంబాల బాధను దేశం తనదిగా భావించింది. వీరుల త్యాగం దేశ చరిత్రలో చెరగని అక్షరాలుగా నిలిచింది. జవాన్ల జీవితం సులభం కాదు. తీవ్ర చలి, ఎండ, వర్షం, ప్రమాదకర పరిస్థితులు

2

## భావోద్వేగాలకు పండుగ... అనుబంధాలకు అంకితమైన రోజు



● ప్రేమ, విశ్వాసం, నిబద్ధతకు ప్రతీక

● యువత నుంచి కుటుంబాల వరకూ విస్తరించిన సంబరం

ఫిబ్రవరి 13 (మనప్రజాప్రతినిధి): ప్రేమ అనేది మనిషి జీవితాన్ని సార్థకం చేసే అత్యంత మృదువైన భావం. అది కేవలం ఒక అనుభూతి మాత్రమే కాదు, జీవనానికి అర్థాన్ని ఇచ్చే శక్తి. అలాంటి ప్రేమను ప్రత్యేకంగా గుర్తించి ప్రపంచవ్యాప్తంగా జరుపుకునే రోజే ప్రేమ దినం. ప్రేమ వారంలో చివరి రోజుగా గుర్తింపు పొందిన ఈ రోజు యువతలో ఎక్కువగా ప్రాచుర్యం పొందినా, కాలక్రమేణా కుటుంబాల వరకూ విస్తరించింది. ప్రేమను బహిరంగంగా వ్యక్తపరచే సందర్భంగా ఇది మారింది. ▶అనుబంధాలను బలపరచే సందర్భంనేటి వేగవంతమైన జీవితంలో భావాలను వ్యక్తపరచడానికి సమయం తగ్గిపోతోంది. పని ఒత్తిళ్లు, వ్యక్తిగత బాధ్యతలు, డిజిటల్ ప్రపంచం కలసి మనసులను దూరం చేస్తున్నాయి. అలాంటి సమయంలో ప్రేమ దినం ఒక అవకాశంలా మారుతుంది. జీవిత భాగస్వామికి, స్నేహితుడికి, కుటుంబ సభ్యులకు

2

## కేసీఆర్ జన్మదిన వేడుకలకు పిలుపు



□ఫిబ్రవరి 17న ప్రత్యేక కార్యక్రమాలు

□కేక్ కట్టింగ్, ప్రత్యేక పాట విడుదల

□కార్యకర్తలకు పెద్దఎత్తున హాజరు కావాలని పిలుపు

2

## పార్కుల కబ్జాలకు చెక్.... హైడ్రా భారీ చర్యలు



● ఒకే కాలనీలో 6 పార్కుల రక్షణ

● గుడిమల్కాపూర్‌లో 1152 గజాల స్థలం విముక్తి

● మొత్తం 3041 గజాలకు ఫెన్సింగ్.. రూ.34.12 కోట్ల భూముల పరిరక్షణ

2

## మధిరలో టీడీపీ దూకుడు.... 10వ వార్డులో బోడేపూడి రేవతి ఘన విజయం



- 166 ఓట్ల భారీ మెజారిటీ
- తొలి రౌండ్ నుంచే స్పష్టమైన ఆధిక్యం
- అనుచరుల సంబరాలు మిన్నంటాయి

మధిర, ఫిబ్రవరి 13 (మన ప్రజా ప్రతినిధి):తెలంగాణలో మధిర మున్సిపల్ ఎన్నికల కౌంటింగ్‌లో 10వ వార్డులో తెలుగుదేశం పార్టీ అభ్యర్థి బోడేపూడి రేవతి ఘన విజయం సాధించారు. కౌంటింగ్ కేంద్రంలో రిటర్నింగ్ అధికారి ఆమె గెలుపును అధికారికంగా ప్రకటించడంతో టీడీపీ శ్రేణుల్లో ఆనందోత్సాహాలు వెల్లివిరి శాయి. నేడు జరిగిన ఓట్ల లెక్కింపులో తొలి రౌండ్ నుంచే రేవతి స్పష్టమైన ఆధిక్యాన్ని కనబరిచారు. ప్రత్యర్థు లకు అవకాశమే ఇవ్వ కుండా ఓటర్లు ఆమెకు మద్దతు ఇచ్చారు. కౌంటింగ్ ప్రక్రియ మొత్తం ఏకపక్షంగా సాగినట్లు రాజకీయ వర్గాలు పేర్కొ న్నాయి. చివరి ఫలితాల ప్రకారం బోడేపూడి రేవతి 334 ఓట్లు సాధించగా, ప్రత్యర్థి పెదపూడి సుధాకర్ 168 ఓట్లు మాత్రమే పొందారు. 166 ఓట్ల భారీ మెజారిటీతో రేవతి విజయం సాధించారు. ఈ ఫలితంతో మధిరలో టీడీపీ శ్రేణుల్లో ఉత్సాహం పెరిగింది. స్థానికంగా పార్టీ బలాన్ని మరోసారి చాటుకున్నామని నాయకులు పేర్కొన్నారు.



## హుజూరాబాద్‌లో కాంగ్రెస్ దూకుడు.. చైర్మన్ పీఠం కైవసం

-బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డికి షాక్

-30 వార్డుల్లో 16 స్థానాలు కాంగ్రెస్ ఖాతాలో

-బీజేపీ 5, స్వతంత్రుడు 1 విజయం



హైదరాబాద్, ఫిబ్రవరి 13 (మనప్రజాప్రతినిధి): హుజురాబాద్ మున్సిపాలిటీలో కాంగ్రెస్ పార్టీ స్పష్టమైన ఆధిక్యంతో చైర్మన్ పీఠాన్ని కైవసం చేసుకుంది. దీంతో స్థానికంగా పాడి కౌశిక్ రెడ్డికు రాజకీయంగా ఎదురుదెబ్బ తగిలినట్లైంది. మొత్తం 30 వార్డుల్లో కాంగ్రెస్ 16 స్థానాల్లో విజయం సాధించడం విశేషంగా మారింది. ఫలితాల ప్రకారం కాంగ్రెస్ 16 వార్డులు గెలుచుకోగా, భారత రాష్ట్ర సమితి 8 స్థానాలకు పరిమితమైంది. భారతీయ జనతా పార్టీ 5 వార్డుల్లో విజయం సాధించగా, ఒక స్వతంత్ర అభ్యర్థి గెలుపొందారు. ఈ ఫలితాలతో

2

## నాదిరేవంత్ రెడ్డిది లక్కీ జోడి మహేష్ కుమార్ గౌడ్

-సమన్వయంతో పార్టీ ముందుకు

-ప్రజల ఆకాంక్షలే లక్ష్యం

-జీహెచ్ఎంసీ ఎన్నికల్లోనూ గెలుపు ధీమా



2

## ఉపాధి హామీ శ్రామికుల ఆవేదన వర్ణనాతీతం వైఎస్ షర్మిల

● ప్రకాశం జిల్లాలో ఎంజీఎన్ఆర్ఈజీఏ పరిరక్షణ యాత్ర

● పాకల గ్రామంలో రచ్చబండ కార్యక్రమం

● వేతనాలు, పనిదినాలపై శ్రామికుల ఆవేదన




ప్రకాశం, ఫిబ్రవరి 13 (మనప్రజాప్రతినిధి): మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్ట పరిరక్షణ యాత్ర నేడు ప్రకాశం జిల్లాలో కొనసాగింది. కొండెపి నియోజక వర్గంలోని పాకల గ్రామంలో నిర్వహించిన రచ్చబండ కార్యక్రమంలో శ్రామికులు తమ సమస్యలను వెల్లడించారు. కార్యక్రమంలో పాల్గొన్న వైఎస్ షర్మిల మాట్లాడుతూ ఉపాధి హామీ శ్రామికుల ఆవేదన వర్ణనాతీతమని పేర్కొన్నారు. శ్రామికులు మాట్లాడుతూ గతంలో వైఎస్ రాజశేఖర రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయం లో కరువు పనులు పండుగలా సాగేవని తెలిపారు. రవాణా చార్జీలతో పాటు పనులు జరిగే ప్రదేశాల్లో మంచి నీళ్లు, మజ్జిగ, రస్నా వంటి సదుపాయాలు కల్పించే వారని గుర్తు చేశారు. ప్రస్తుతం వందరోజుల హామీ ఉన్నప్పటికీ సగం రోజులు కూడా పని దొరకడం లేదని, చేసిన పనులకు వేతనాలు ఎప్పుడు చెల్లిస్తారో తెలియని పరిస్థితి

2

# పుల్వామా అమర వీరుల స్మరణ దినం

మొదటి పేజీ తరువాయి



ఇవన్నీ వారి దైనందిన జీవితంలో భాగమే. కుటుంబం దూరంగా ఉండి, కర్తవ్యాన్ని ముందుగా ఉంచి సేవ చేయడం వారి ధర్మం. దేశ భద్రతే వారి లక్ష్యం. ఆ లక్ష్యం కోసం వారు ప్రాణత్యాగానికీ సిద్ధమవుతారు. పుల్వామా అమర వీరులు ఆ త్యాగానికి నిదర్శనం.ఈ స్మరణ దినం మనకు ఒక ప్రశ్నను కూడా వేస్తుంది. దేశం కోసం తమ ప్రాణాలను అర్పించిన వీరులకు మనం ఎలా కృతజ్ఞత చెల్లించాలి? కేవలం నివాళులు అర్పించడం సరిపోతుందా? వారి కుటుంబాలకు అండగా నిలవడం, వారి త్యాగాన్ని గౌరవించే సమాజాన్ని నిర్మించడం, దేశ ఐక్యతను కాపాడుకోవడ ఇవే నిజమైన నివాళి. జవాన్లు సరిహద్దుల్లో కాపలా కాస్తే, పౌరులుగా మనం దేశంలో క్రమశిక్షణ, బాధ్యత, ఐక్యతను పాటించాలి. యువతకు ఈ రోజు ఒక స్ఫూర్తి. దేశ సేవ అంటే కేవలం సైన్యంలో చేరడం మాత్రమే కాదు. ప్రతి రంగంలోనూ నిజాయితీగా పని చేయడం, దేశ ప్రయోజనాలను ముందుంచడం, సమాజానికి మేలు చేయడం దేశభక్తి రూపాలే. అమర వీరుల త్యాగం మనలో ఆ భావాన్ని బలపరచాలి. పుల్వామా అమర వీరుల స్మరణ దినం ఒక విషాద జ్ఞాపకం మాత్రమే కాదు. అది ఒక గౌరవ సూచకం. దేశం కోసం ప్రాణాలు అర్పించిన వారి ధైర్యాన్ని, అంకితభావాన్ని గుర్తు చేసే రోజు. వారి త్యాగం వృథా కాకుండా దేశాన్ని మరింత బలంగా, ఐక్యంగా నిలబెట్టడం మన బాధ్యత. మొత్తంగా ఈ రోజు మన హృదయాల్లో గౌరవాన్ని, కృతజ్ఞతను నింపుతుంది. అమరుల త్యాగం ఎప్పటికీ మరువలేనిది. వారి ధైర్యం తరతరాలకు స్ఫూర్తి. దేశం కోసం ప్రాణాలు అర్పించిన పుల్వామా అమర వీరులకు శత శత నమనాలు. వారి జ్ఞాపకం భారత మన్నులో చిరస్థాయిగా నిలిచిపోతుంది. అమర వీరుల త్యాగం మనకు ఒక బాధ్యతను గుర్తు చేస్తుంది. దేశం పట్ల కర్తవ్యాన్ని నిర్వర్తించడం ప్రతి పౌరుడి బాధ్యత. జవాన్లు సరిహద్దుల్లో కాపలా కాస్తే, పౌరులు దేశంలో క్రమశిక్షణ, ఐక్యత, నిబద్ధతను పాటించాలి. వారి త్యాగం వృథా కాకుండా దేశాన్ని బలంగా నిలబెట్టడం మన కర్తవ్యం.పుల్వామా అమర వీరుల స్మరణ దినం కేవలం ఒక రోజు కార్యక్రమంగా మిగలకూడదు. ఇది దేశభక్తిని మళ్లీ మళ్లీ గుర్తు చేసే సందర్భం. యువతకు స్ఫూర్తినిచ్చే రోజు. దేశ రక్షణలో ప్రాణాలు అర్పించిన జవాన్ల కుటుంబాలకు మనం అండగా నిలవాల్సిన అవసరాన్ని గుర్తు చేసే రోజు.మొత్తంగా ఈ రోజు మన హృదయాల్లో గౌరవాన్ని, కృతజ్ఞతను నింపుతుంది. దేశం కోసం ప్రాణాలు అర్పించిన అమర వీరులకు శత శత నమనాలు. వారి త్యాగం ఎప్పటికీ మరువలేనిది. వారి ధైర్యం, సేవ భావం తరతరాలకు స్ఫూర్తిగా నిలుస్తాయి

# పార్కుల కబ్జాలకు చెక్.. హైడ్రా భారీ చర్యలు

మొదటి పేజీ తరువాయి

హైదరాబాద్, ఫిబ్రవరి 13 (మనప్రజాప్రతినిధి): ప్రాణవాయువును అందించే పార్కులపై జరుగుతున్న కబ్జాలను సీరియస్‌గా పరిగణిస్తున్న హైడ్రా శుక్రవారం ఒకేరోజు భారీ చర్యలు చేపట్టింది. ఒకే కాలనీలో 6 పార్కులను కాపాడుతూ 2260 గజాల స్థలానికి ఫెన్సింగ్ వేసింది. మరో ప్రాంతంలో 1152 గజాల పార్కు స్థలాన్ని కబ్జాల నుంచి విముక్తి చేసింది. మొత్తం 3041 గజాల విస్తీర్ణంలో ఉన్న పార్కులను రక్షిస్తూ సుమారు రూ.34.12 కోట్ల విలువైన




భూములను కాపాడింది.మేడ్చల్‌మల్కాజిగిరి జిల్లా కుత్బుల్లాపూర్ మండలం జీడిమెట్ల గ్రామంలోని భాగ్యలక్ష్మి కాలనీలో 1968లో 80 ఎకరాల్లో 810 ప్లాట్లతో లేఅవుట్ రూపొందించి 10 పార్కులు కేటాయించారు. హైటెన్షన్ విద్యుత్ లైన్లు తొలగించిన తర్వాత ఆక్రమణలు ప్రారంభమైనట్లు నివాసితులు ఫిర్యాదు చేశారు. హైడ్రా కమిషనర్ ఏవి రంగనాథ్ ఆదేశాల మేరకు అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ చేసి పార్కు స్థలాలను గుర్తించారు. వరుసగా ఉన్న 6 పార్కుల నుంచి ఆక్రమణలు తొలగించి ఫెన్సింగ్ వేసి బోర్డులు ఏర్పాటు చేశారు. స్థానికులు హైడ్రాకు కృతజ్ఞతలు తెలుపుతూ సంబరాలు నిర్వహించారు.ఇక హైదరాబాద్ జిల్లా ఆసిఫ్‌నగర్ మండలం గుడిమల్కాపూర్‌లో ఏజీ ఆఫీస్ కోఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ లేఅవుట్‌లో పార్కుగా కేటాయించిన సుమారు 1452 గజాల స్థలంపై కబ్జాలు జరిగాయి. ఇసుక వ్యాపారం, వాహనాల పార్కింగ్, ఇతర వాణిజ్య వినియోగాలు జరుగుతున్నట్లు గుర్తించారు. నివాసితుల ఫిర్యాదుపై హైడ్రా చర్యలు చేపట్టి ఆక్రమణదారులను ఖాళీ చేయించి ఫెన్సింగ్ వేసింది. పార్కుల రక్షణకు హైడ్రా కట్టుబడి ఉందని అధికారులు తెలిపారు. ప్రజా స్థలాలను పరిరక్షించడంలో రాజీ ఉండదని స్పష్టం చేశారు. స్థానిక ప్రజలు భారీ ర్యాలీలు నిర్వహించి హైడ్రాకు మద్దతు తెలిపారు

# ఉపాధి హామీ శ్రామికుల ఆవేదన వర్ణనాతీతం వైఎస్ షర్మిల

మొదటి పేజీ తరువాయి



నెలకొందని వాపోయారు. పాకల గ్రామ ప్రజలు ఎంజీఎన్‌ఆర్ ఈజీఏ పథకం కొనసాగాలని, దీనిని బలహీనపరచే చర్యలు తీసుకో వద్దని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ చేపట్టిన పరిరక్షణ పోరాటానికి మద్దతుగా నిలుస్తామని తెలిపారు.చట్టాన్ని రద్దు చేయాలని కూడా డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా షర్మిల మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం గ్రామీణ పేదలకు జీవనాధారమని, శ్రామికులకు సమయానికి వేతనాలు చెల్లించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. గ్రామీణాభివృద్ధి కోసం ఈ పథకాన్ని మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని ఆమె పేర్కొన్నారు.

# మహిళలను అవమానించే వ్యాఖ్యలు సరికాదు మంత్రి అనిత

**-అంబటి వ్యాఖ్యలపై తీవ్ర ఆక్షేపణ**

**-ఆరోపణలకు ఆధారాలు ఇవ్వాలని సవాల్**

**-రెచ్చగొట్టే వ్యాఖ్యలకు సమాధానం ఏమిటని ప్రశ్న**



అమరావతి, ఫిబ్రవరి 13 (మనప్రజాప్రతినిధి): మహిళలను అవమానించేలా మాట్లాడిన నేతలు సమాజానికి తప్పు సందేశం ఇస్తున్నారని ఆంధ్రప్రదేశ్

3

# భావోద్వేగాలకు పండుగ... అనుబంధాలకు అంకితమైన రోజు

మొదటి పేజీ తరువాయి



మనసులోని ప్రేమను చెప్పుకునే రోజు ఇది. చిన్న అపార్థాలు, దూరాలు ఈ రోజున కరిగిపోవచ్చు. ఒక సందేశం, ఒక పువ్వు, ఒక చిన్న బహుమతి కూడా అనుబంధాలను మరింత బలపరచగలవు.

▶ **ప్రేమకు పునాది విశ్వాసం, గౌరవం**

ప్రేమ అనేది కేవలం ఉత్సాహం కాదు. అది బాధ్యతతో కూడిన భావం. పరస్పర గౌరవం, అర్థం చేసుకోవడం, నిబద్ధత, విశ్వాసంఇవే ప్రేమకు నిజమైన పునాది. ప్రేమ దినం ఈ విలువలను గుర్తు చేస్తుంది. సంబంధాలు నిలబడాలంటే ఓర్పు అవసరం. తక్షణ భావోద్వేగాలకు లోనవకుండా, దీర్ఘకాల అనుబంధాలను కాపాడుకోవడం ముఖ్యం. ప్రేమను ప్రదర్శనగా కాకుండా, అనుభూతిగా చూడాల్సిన అవసరాన్ని ఈ రోజు గుర్తుచేస్తుంది.

▶ **యువతలో ఉత్సాహం కుటుంబాల్లో ఆప్యాయత**

ప్రేమ దినం యువతలో ఉత్సాహంగా జరుపుకుంటారు. స్నేహితులు, ప్రేమికులు బహుమతులు ఇచ్చిపుచ్చుకుంటారు. సామాజిక మాధ్యమాల్లో ప్రేమ సందేశాలు పంచుకుంటారు. అయితే ఇది కేవలం ప్రేమికులకే



పరిమితం కాదు. తల్లిదండ్రులు పిల్లలకు ప్రేమను తెలియజేస్తారు. పిల్లలు పెద్దలకు కృతజ్ఞత తెలుపుతారు. స్నేహితులు తమ అనుబంధాన్ని గుర్తు చేసుకుంటారు. ఇలా ప్రేమ అనేది ఒక్క రూపంలో కాకుండా అనేక రూపాల్లో వ్యక్తమవుతుందని ఈ రోజు స్పష్టమవుతుంది.ప్రేమ దినం కేవలం ఆర్భాటానికి మాత్రమే పరిమితం కాకూడదు. ఖరీదైన బహుమతుల కంటే భావానికి విలువ ఇవ్వాలి. నిజమైన ప్రేమలో గౌరవం, పరిమితి, పరస్పర సమ్మతి ఉండాలి. ప్రేమ మనిషిని మరింత బాధ్యతాయుతుడిగా మార్చాలి. సంబంధాల్లో నిబద్ధతను పెంచాలి.మొత్తంగా ప్రేమ దినం అనేది భావోద్వేగాలకు పండుగ. మనసులను దగ్గర చేసే రోజు. విశ్వాసాన్ని బలపరచే సందర్భం. ప్రేమను గౌరవంగా, బాధ్యతగా, మధురంగా వ్యక్తపరచే రోజు. ప్రేమ అనేది మనిషిని మనిషిగా నిలబెట్టే శక్తి. ఆ శక్తిని గుర్తు చేసే రోజే ప్రేమ దినం.

# కేసీఆర్ జన్మదిన వేడుకలకు పిలుపు

మొదటి పేజీ తరువాయి

హైదరాబాద్, ఫిబ్రవరి 13 (మనప్రజాప్రతినిధి): ఈ నెల 17న తెలంగాణ తొలి ముఖ్యమంత్రి, కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు జన్మదినం సందర్భంగా పార్టీ కేంద్ర కార్యాలయం తెలంగాణ భవన్‌లో భారీ స్థాయిలో వేడుకలు నిర్వహిస్తున్నట్టు మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎల్పీ ఉపనాయకుడు తలసాని శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. ఈ వేడుకల్లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఎల్పీ ఉపనాయకుడు టి హరీశ్ రావుతో పాటు పార్టీ సీనియర్ నేతలు పాల్గొంటారని వెల్లడించారు. కార్యక్రమంలో కేక్ కట్టింగ్, కేసీఆర్‌పై రూపొందించిన ప్రత్యేక గీతం విడుదల వంటి కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. ఫిబ్రవరి 17న రాష్ట్ర నలుమూలల నుంచి బీఆర్ఎస్ కార్యకర్తలు తెలంగాణ భవన్‌కు భారీగా తరలి రావాలని తలసాని పిలుపునిచ్చారు. పార్టీ శ్రేణులు ఉత్సాహంగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

# హుజురాబాద్‌లో కాంగ్రెస్ దూకుడు.. చైర్మన్ పీఠం కైవసం

కాంగ్రెస్‌కు మున్సిపల్ చైర్మన్ పదవి దాదాపు ఖాయం అయింది. స్థానిక స్థాయిలో కాంగ్రెస్ శ్రేణుల్లో ఉత్సాహం వెల్లివిరుస్తోంది. హుజురాబాద్‌లో పార్టీ బలాన్ని మరోసారి చాటుకున్నామని కాంగ్రెస్ నాయకులు పేర్కొంటున్నారు. బీఆర్ఎస్‌కు ఇది గట్టి హెచ్చరికగా భావిస్తున్నారు. మున్సిపల్ ఎన్నికల ఫలితాలు రాష్ట్ర రాజకీయాల్లో కొత్త సమీకరణాలకు దారితీసే అవకాశముందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. కాంగ్రెస్ విజయం పార్టీకి మరింత ఉత్సాహాన్ని నింపింది.

మొదటి పేజీ తరువాయి



# నేరేడుచర్లలో... మున్సిపల్ ఎన్నికల్లో జనసేన బోణి

**-నేరేడుచర్ల 14వ వార్డులో విజయం**

**-యువత మద్దతుతో గెలుపు**

**-తెలంగాణలో బలపడే దిశగా సంకేతం**



నేరేడుచర్ల, ఫిబ్రవరి 13 (మనప్రజాప్రతినిధి): తెలంగాణ మున్సిపల్ ఎన్నికల్లో జనసేన పార్టీ బోణి కొట్టింది. సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల మున్సిపాలిటీలోని 14వ వార్డులో ఆ పార్టీ అభ్యర్థి సమీప ప్రత్యర్థిపై విజయం సాధించారు. రాష్ట్రంలో విస్తృతంగా పోటీ చేసిన జనసేనకు ఈ గెలుపు శుభారంభంగా భావిస్తున్నారు. పార్టీ అధినేత పవన్ కల్యాణ్ నేరుగా ప్రచారంలో పాల్గొనకపోయినా, స్థానిక నాయకత్వం మరియు కార్యకర్తలు క్షేత్రస్థాయిలో చేసిన కృషి ఫలితమిచ్చినట్లు పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి. ముఖ్యంగా యువత, మార్పు కోరుకునే ఓటర్లు జనసేన వైపు మొగ్గు చూపినట్లు విశ్లేషణలు సూచిస్తున్నాయి. మొత్తం 200కు పైగా స్థానాల్లో పోటీ చేసిన జనసేనకు ఈ తొలి విజయం కార్యకర్తల్లో ఉత్సాహాన్ని నింపింది. తెలంగాణలో పార్టీ స్థిరపడే ప్రయత్నాలకు ఇది బలమైన సంకేతంగా రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. నేరేడుచర్లలో జనసేన శ్రేణుల్లో ఇప్పుడు కొత్త ఉత్తేజం కనిపిస్తోంది. భవిష్యత్ ఎన్నికల్లో మరింత బలోపేతం కావాలనే లక్ష్యంతో పార్టీ కార్యకర్తలు ముందుకు సాగుతున్నారు.

# మహిళలను అవమానించే వ్యాఖ్యలు సరికాదు మంత్రి అనిత



తరువాయి భాగం హోంమంత్రి వంగలపూడి అనిత పేర్కొన్నారు. ఇటీవలి వ్యాఖ్యలపై స్పందిస్తూ అంబటి రాంబాబు చేసిన వ్యాఖ్యలను ఆమె తీవ్రంగా ఖండించారు. గౌరవమైనసభల్లో అలాంటి నేతల కోసం మాట్లాడడం అవసరమా అని ప్రశ్నించారు. వైసీపీ నేతలు అంబటి రాంబాబు తల్లి గురించి మాట్లాడారని ఆరోపణలు చేస్తున్నారని, అయితే అందుకు ఆధారాలు ఉంటే వెంటనే చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. నిరాధార ఆరోపణలు చేయడం సరికాదని అన్నారు. రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేసి వాతావరణాన్ని ఉద్రిక్తం చేసే రాజకీయాలు సమాజానికి మేలు చేయవని అనిత పేర్కొన్నారు. అంబటి వ్యాఖ్యలకు వైసీపీ నేతలు ఏం సమాధానం చెబుతారని ఆమె ప్రశ్నించారు. రాజకీయాల్లో పరస్పర గౌరవం అవసరమని, మహిళలను అవమానించే విధంగా మాట్లాడడం అంగీకారయోగ్యం కాదని ఆమె స్పష్టం చేశారు.

# కాంగ్రెస్ సిపిఐ పొత్తు లో అభ్యర్థుల విజయ దుందుభి



నేరేడుచర్ల (మనప్రజా ప్రతినిధి దినపత్రిక ) కొత్తగూడెం కార్పొరేషన్ గెలుపుతో పాటు సిపిఐ బలపరిచిన కోదాడ హుజూర్నగర్ నేరేడుచర్ల మున్సిపాలిటీలో కాంగ్రెస్ ఘన విజయం సాధించడం పట్ల సిపిఐ రాష్ట్ర కమిటీ సభ్యులు ధనుంజయ నాయుడు హర్షం వ్యక్తం చేశారు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు నాయకత్వం వహిస్తున్న కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ తో పాటు రాష్ట్ర మంత్రివర్యులు కెప్టెన్ నలమాద ఉత్తమ కుమార్ రెడ్డి కోదాడ ఎమ్మెల్యే పద్మావతి నాయకత్వంలో సిపిఐ మరియు కాంగ్రెస్ పార్టీ నాయకత్వంలో హోరాహోరీ జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో ఘన విజయం సాధించిన అభ్యర్థులకు సిపిఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు ధనుంజయ నాయుడు మండల సిపిఐ కార్యదర్శి కత్తి శ్రీనివాసరెడ్డి యల్లబోయిన సింహాద్రి వ్యవసాయ కార్మిక సంఘం ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు చిలకరాజు శ్రీను మహిళా సమాఖ్య జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ గా లక్ష్మి ఏఐటీయూసీ మండలాధ్యక్షుడు ఊదర వెంకన్న బీసీ హక్కుల సాధన సమితి జిల్లా సహాయ కార్యదర్శి కొమ్మరాజు వెంకట్, ఏఐవైఎఫ్ పట్టణ అధ్యక్షుడు పరికె భరత్ సిపిఐ నాయకుడు బత్తిని శ్రీనివాస్ గౌడ్ తదితరులు అభినందనలు తెలియజేశారు తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ సిపిఐ కలిసి పోటీ చేసిన ప్రతిసారి ప్రజలు ఆదరిస్తున్నారని, పది సంవత్సరాలు అధికారంలో ఉన్న బిఆర్ఎస్ పార్టీ ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబించడం వల్లనే కాంగ్రెస్కు పట్టం కట్టారని ఇటీవల కాలంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులుగా చెప్పుకుంటున్న కేటీఆర్ మరియు హరీష్ రావు కాంగ్రెస్ పార్టీ మీద అనవసరంగా నిప్పులు కక్కుతున్నారని అయినా ప్రజలు వారిని పట్టించుకోలేదని ఈ ఎన్నికల ఫలితాలు రుజువు చేశాయని ఇప్పటికైనా బుద్ధి తెచ్చుకొని నిజా నిజాలు తెలుసుకొని ప్రజల మనోభావాలకు అనుగుణంగా నడుచుకోకపోతే ఆ పార్టీ కూడా తెలుగుదేశం పార్టీ లాగా తెలంగాణాలో ఉప్పుగల్లుకు కూడా లేకుండా పోతుందని ఆయన హెచ్చరించారు రాష్ట్రంలో ఒక్క కార్పొరేషన్ గెలుచుకోలేకపోయి చతిగల పడ్డవారు, కుటుంబంలో లుకలుకలు ప్రారంభమై అవినీతి ఆరోపణలతో కునారిల్లు తున్నవారు దిక్కు తోచక పిచ్చి చూపులు చూస్తూ వెకిలిమాటలు మాట్లాడడం ప్రజలు సహించకనే బిఆర్ఎస్ పార్టీకి ఈ గతి పట్టిందని ఆయన అన్నారు కొత్తగూడెం ఎన్నికల్లో సిపిఐ ఒంటరిగా కార్పొరేషన్ కైవసం చేసుకున్న విషయాన్ని కాంగ్రెస్ పార్టీ కూడా గమనంలో ఉంచుకోవాలని ప్రజాక్షేత్రంలో సిపిఐ కి బలమైన పునాదులు ఉండటం వలన ఇది సాధ్యమైందని భవిష్యత్తులో సిపిఐ తో విభేదిస్తే కాంగ్రెస్ పార్టీకే నష్టం జరుగుతుందని ఆయన ఉదహరించారు

# సూరంపల్లిలో కుక్కల బీభత్సం....
## 3 ఏళ్ల చిన్నారిపై దాడి, ప్రజల్లో ఆందోళన





(మన ప్రజా ప్రతినిధి ఫిబ్రవరి 13):సూరంపల్లి గ్రామం: సిద్దిపేట జిల్లా దౌల్తాబాద్ మండల కేంద్రంలోని సూరంపల్లి గ్రామంలో వీధి కుక్కల బీభత్సం కలకలం రేపింది. ఇంటి వద్ద ఆడుకుంటున్న మూడు సంవత్సరాల చిన్నారి మోక్షితపై కుక్కలు తీవ్రంగా దాడి చేయడంతో గ్రామంలో భయాందోళనలు నెలకొన్నాయి.బాధిత చిన్నారి తండ్రి నవీన్ తెలిపిన వివరాల ప్రకారం, ఇంటి సమీపంలో ఆడుకుంటున్న సమయంలో ఒక్కసారిగా కుక్కలు దాడి చేసి తీవ్రంగా గాయపరిచాయి. వెంటనే కుటుంబ సభ్యులు 108 అంబులెన్స్కు సమాచారం ఇవ్వగా, చిన్నారిని చికిత్స కోసం గజ్వేల్ ప్రభుత్వ ఆసుపత్రి కు తరలించారు.స్థానిక గ్రామస్తులు మాట్లాడుతూ, గత కొన్ని రోజులుగా గ్రామంలో వీధి కుక్కలు తరచూ ప్రజలను వెంటాడుతూ కరుస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. చిన్నారిపై జరిగిన దాడి ఘటనతో తల్లిదండ్రులు తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారని తెలిపారు.ఈ ఘటనపై అధికారులు తక్షణమే స్పందించి గ్రామంలో తిరుగుతున్న కుక్కలను పట్టుకొని షెల్టర్ హోమ్లకు తరలించాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. ప్రజల భద్రత కోసం వెంటనే చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

# నాగూర్ నాయుడు మృతదేహానికి నివాళులర్పించిన...
## ఏర్పేడు మండల టిడిపి ప్రెసిడెంట్ పేరం నాగరాజు నాయుడు



ప్రజా ప్రతినిధి ఏర్పేడు మండలం:ఈరోజు ఏర్పేడు మండలం రాజులపాలెం గ్రామంలో ఎల్లంకి పెద్ద నాగూర్ నాయుడు. మరణించటం జరిగింది వారికి ఏర్పేడు మండల టీడీపీ పార్టీ అధ్యక్షులు పేరం నాగరాజ నాయుడు & కేశినేని సుబ్రహ్మణ్యం, జగదీష్, రాచటి సుబ్రహ్మణ్యం ,గుణాయాదవ్,చంద్రశేఖర్ నాయుడు,సురేష్, వెంకయ్య, పూలమాలలు వేసి నివాళులు అర్పించటం జరిగింది.

# కొండపాక లో సీఎం కప్ జిల్లా స్థాయి బాక్సింగ్ పోటీలు



మన ప్రజా ప్రతినిధి కొండపాక మండల్ :జెడ్ పి హెచ్ ఎస్ కొండపాక పాఠశాల లో సీఎం కప్ జిల్లా స్థాయి బాక్సింగ్ పోటీలు అత్యంత వైభవంగా నిర్వహించబడ్డాయి.బాక్సింగ్ పోటీలను జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీనివాస్ రెడ్డి,మండల విద్యాధికారి శ్రీనివాస్ రెడ్డి,మండల అభివృద్ధి అధికారి వెంకటేశ్వర్లు,గ్రామ ప్రథమ పౌరురాలు సర్పంచ్ మాంచాల నవీన శ్రీనివాస్,పాఠశాల ప్రధానోపాధ్యాయులు సముద్రాల శ్రీనివాస్ పిడి నర్రా భాస్కర్ రెడ్డి ప్రారంభించారు.ఇట్టి పోటీలలో సిద్దిపేట జిల్లాలోని 50 మంది యువకులు,30 మంది యువతులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.బాక్సింగ్ నిర్వాహకులు కృష్ణ ప్రతాపరెడ్డి చక్కగా పర్యవేక్షించారు.క్రీడల అనంతరము విద్యార్థులకు మెడల్స్ కప్స్ బహుమతులు అందజేశారు

# శాస్త్రవేత్తలు వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో మొక్కజొన్న సుదర్శన




అక్కన్నపేట మండల్. ఫిబ్రవరి మనప్రజాప్రతిని. 14:ఉచితంగా రైతులకు గడ్డి మందు పంపిణీ 13.02.2026 నాడు తెలంగాణ రైతు విజ్ఞాన కేంద్రం, మొక్కజొన్న పరిశోధన కేంద్రం, రాజేంద్రనగర్ వారి ఆధ్వర్యంలో మొక్కజోన్నలో మేలైన యాజమాన్య పద్ధతులపై అవగాహన మరియు శిక్షణ కార్యక్రమంలో భాగంగా రైతులకు మొక్కజొన్న విత్తనం డిహెచ్ఎం 206 అనే హైబ్రిడ్ రకంను అక్కన్నపేట మండలం నందు రైతు పొలాల్లో పరిశీలించడానికి 25 మంది రైతులకు నవంబర్ లో విత్తనం అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయ మొక్కజొన్న పరిశోధన విభాగం నుండి డాక్టర్. శ్రావణి గారు మాట్లాడుతూ ఈ రకం నీటి ఎద్దడిని మరియ ఎండు తెగులను తట్టుకోవడమే గాక అధిక దిగుబడి వస్తుందని తెలిపారు, మొక్కజోన్నలో మేలైన యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డా. పల్లవి, తెలంగాణ రైతు విజ్ఞాన కేంద్రం కోఆర్డినేటర్ మరియు శాస్త్రవేత్త మాట్లాడుతూ వరికి ప్రత్యామ్నాయంగా మొక్కజొన్న పంటను రైతులు వేసుకున్నట్లయితే రైతులు నికర ఆదాయం తో పాటు పంట మార్పిడి జరుగుతుందని, అదేవిధంగా వడగండ్ల నుంచి కూడా రైతులు పంటను కాపాడుకోవచ్చని తెలిపారు. అదేవిదంగా మొక్కజొన్న సాగు పద్ధతుల్లో ఎరువులు, పురుగు మందుల వినియోగం గురించి వివరించారు. వరి తో పోల్చుకుంటే మొక్క జొక్క పంట కాలం తక్కువ మరియు నికర ఆదాయం అధికం అని తెలిపారు. యాసంగిలో 40-45 క్వింటాళ్లు ఎకరాకు తీయవచ్చునని తెలిపారు. తర్వాత రైతులకు మొక్కజొన్న పంటకు అవసరమైన కలుపు మందును పంపిణి చేశారు. తర్వాత డా. అనూష, శాస్త్రవేత్త గారు మాట్లాడుతూ మొక్కజోన్నలో వివిధ పురుగులు మరియు తెగుళ్ళ యాజమాన్యం గురించి వివరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి శ్రీలత, సర్పంచ్ బానోత్ వెంకటేష్, ఉప సర్పంచ్ రాజు, పంచాయతీ సెక్రటరీ సంపత్ మరియు అక్కన్నపేట మండల రైతులు పాల్గొన్నారు.

# దొమ్మాట గాజులపల్లిలో ఆధ్యాత్మిక వేడుకలు
## శివపార్వతుల కళ్యాణానికి సిద్ధమైన ఆలయం



(మన ప్రజా ప్రతినిధి ఫిబ్రవరి 13):సిద్ధిపేట జిల్లా దౌల్తాబాద్ మండలం: దొమ్మాట గాజులపల్లిలోని దక్షిణ కాశీ కైలేశ్వర ఆలయంలో నిర్వహించే శివపార్వతుల కళ్యాణ మహోత్సవానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని ఆలయ కమిటీ పిలుపునిచ్చింది.ఈ సందర్భంగా గురు దత్త పీఠాధిపతి కొడకండ్ల శ్రీరామ్ చరణ్ శర్మ గురూజీ మాట్లాడుతూ గ్రామాల మధ్యలో వెలసిన ఈ పురాతన ఆలయం పునర్నిర్మాణంతో ప్రసిద్ధి చెందిన క్షేత్రంగా మారిందన్నారు. ఆదివారం బ్రహ్మీ ముహూర్తంలో ఉదయం 4 గంటల 5 నిమిషాలకు సంతత ద్వారా అభిషేకం, గణపతి పూజ, పుణ్యవచనం, ప్రత్యేక పూజలు, అభిషేకాలు, రుద్ర హోమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.శివపార్వతుల కళ్యాణ మహోత్సవం సందర్భంగా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో గాజులపల్లి సర్పంచ్ పంజా స్వామి, వెంకటరెడ్డి, ఉప సర్పంచ్ గొల్లపల్లి ప్రేమ్ కుమార్, అక్కం స్వామి, బాలకిషన్ తదితరులు పాల్గొన్నారు

# బాల్య వివాహాలకు దూరంగా ఉండాలి



ప్రజా ప్రతినిధి ఏర్పేడు మండలం:తిరుపతి జిల్లా ఏర్పేడు సీఐ శ్రీకాంత్ రెడ్డి ప్రజలకు మంచి సందేశాన్ని అందించారు.మహా లిశివరాత్రి పండుగ సందర్భంగా బాల్య వివాహాలపై ఏర్పేడు సీఐ శ్రీకాంత్ రెడ్డి .ప్రజలకు హెచ్చరిక జారీ చేశారు. బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని, అటువంటి ఘటనలు జరిగితే సంబంధిత వ్యక్తులపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు.లిపిల్లల భవిష్యత్తు దృష్ట్యా తల్లిదండ్రులు, గ్రామ పెద్దలు, యువజన సంఘాలు బాధ్యతగా వ్యవహరించి బాల్య వివాహాలను అరికట్టాలని కోరారు. బాల్య వివాహాలకు సంబంధించిన సమాచారం అందిన వెంటనే పోలీసులకు తెలియజేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.బాల్య వివాహాలు పిల్లల ఆరోగ్యం, విద్య, భవిష్యత్తుపై ప్రతికూల ప్రభావం చూపుతాయని, సమాజం మొత్తం కలిసి వాటిని అరికట్టాలని మరియు గ్రామాలు లోని గ్రామ సర్పంచ్ ఆశవర్కర్లు అంగనవాడి టీచర్ మరియు హెల్పర్లు బాలికలపైన దృష్టి సాధించండి ఏర్పేడు . సీఐ శ్రీకాంత్ రెడ్డి. తెలిపారు.

# మున్సిపల్ ఎన్నికల్లో దూకుడు పెంచిన టిఆర్ఎస్
## చైర్మన్ పదవి పొందిన సంకేపల్లి రఘునందన్ రెడ్డి




మన ప్రజా ప్రతినిధి తేదీ13/02/2026 శుక్రవారం తిరుమలగిరి: మున్సిపల్ ఓట్ల లెక్కింపులో 15 వార్డులకు గాను బిఆర్ఎస్ పార్టీ 10 స్థానాలను గెలుచుకొని మున్సిపల్ చైర్మన్ పీఠాన్ని కైమసం చేసుకుంది మున్సిపల్ చైర్మన్ గా సీనియర్ బిఆర్ఎస్ నాయకులు సంకేపల్లి రఘునందన్ రెడ్డి ప్రమాణం స్వీకారం చేసే అవకాశాలు కనిపిస్తున్నాయి ఇప్పటికే బిఆర్ఎస్ పార్టీ మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్ కుమార్ తిరుమలగిరి మున్సిపల్ చైర్మన్ పీఠాన్ని కైవసం తీసుకొవాడానికి విస్తృతంగా ప్రచారం చేయడంతో పాటు అభ్యర్థులకు సూచనలు చేశారు అదే బాటలో బి ఆర్ ఎస్ చెందిన సంకేపల్లి రఘునందన్ రెడ్డి తమ అనుచరులను గెల్చుకోవడానికి చేసిన ప్రయత్నాలు ఫలించాయి దీంతో అనుకున్న దానికంటే ఎక్కువ శాతం లో బిఆర్ఎస్ పార్టీ కౌన్సిలర్ ను కైవసం చేసుకోవడంతో తిరుమలగిరి మున్సిపల్ కేంద్రంలో ఆ పార్టీ కార్యకర్తల నాయకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు కాంగ్రెస్ పార్టీ నాయకులు చేసిన ప్రయత్నాలన్నీ విఫ్లమయ్యాయి ఎమ్మెల్యేతో పాటు ఎంపీ మంత్రి పర్యటించిన వారి ప్రయత్నాలు ఫలించలేదు

# ఇంట్లో ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య



మన ప్రజా ప్రతినిధి కొండపాక మండల్ :ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన కొండపాక మండలం మర్పడగ గ్రామనికి చెందిన మర్యాల అశోక్, వ. 43 సం.లు, గ్రామంలో కిరాణా షాపు పెట్టుకొని జీవనం కొనసాగిస్తున్నాడు. త్రీ టౌన్ ఇన్స్పెక్టర్ టి . లక్ష్మీ బాబు తెలిపిన వివరాల ప్రకారం అతని భార్య సంజన, వ. 28 సం.లు తో సంసార విషయంలో చిన్న, చిన్న మనస్పర్థలతో రెండు నెలల క్రితం ఇద్దరు పిల్లలను తీసుకోని తన తల్లిగారింటికి బూర్గుపల్లి గ్రామనికి వెళ్ళింది. మృతుడు అప్పటి నుండి తన ఇంట్లోనే ఉంటున్నాడు. తేదీ: 13.02.2026 నాడు మద్యాహ్నం 2.20 గంటల సమయంలో మృతుని అన్న భాస్కర్ పలుమార్లు ఫోన్ చేసిన లిఫ్ట్ చేయకపోవడంతో అశోక్ ఇంటికి వెళ్ళి చూడగా ఇంట్లో ఉన్న రేకులతో వేసిన పై కప్పు పైపుకు తాడుతో ఉరి వేసుకోని చనిపోయి ఉన్నాడు. తన భార్య అలిగి పుట్టింటికి వెళ్ళిందని మనస్తాపంతో ఆత్మహత్య చేసుకున్నాడని తల్లి వీరమణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పరిశోదన ప్రారంభించనైనది.

# గిరి ప్రదక్షణ రోడ్డు మ్యాప్ ప్రారంభం.....



ప్రజా ప్రతినిధి శ్రీకాళహస్తి నియోజకవర్గం ఫిబ్రవరి 13:ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చే శ్రీకాళహస్తీశ్వర స్వామి వారి గిరి ప్రదక్షిణ రోడ్డు మార్గం ప్రారంభం మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు 2026 సందర్భంగా శ్రీకాళహస్తీశ్వర స్వామి వారి దేవస్థానానికి అనుబంధంగా అభివృద్ధి చేసిన 22 కిలోమీటర్ల గిరి ప్రదక్షిణ రోడ్డు మార్గాన్ని భక్తుల సౌకర్యార్థం అందుబాటులోకి తీసుకురావడానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి వర్యులు కొణిదెల పవన్ కళ్యాణ్ . 13-02-2026 వ తేదీన ఉదయం 09:00 - 10:00 గంటల మధ్య శిలాఫలకం ఆవిష్కరణ ద్వారా గిరి ప్రదక్షిణ రోడ్డు మార్గాన్ని వర్చువల్‌లివిధానంలో ప్రారంభించనున్నారు. కొట్టేసాయి ప్రసాద్ శ్రీకాళహస్తీశ్వర స్వామి వారి దేవస్థాన చైర్మన్

# కరీంనగర్‌లో కమల వికాసం.. బీజేపీ ఖాతాలో మేయర్ పీఠం

**-66 డివిజన్లలో 33 స్థానాలు బీజేపీకి**
**-ఎక్స్‌ఆఫీషియో ఓటుతో మేజిక్ ఫిగర్ పూర్తి**
**-బీఆర్ఎస్ మూడో స్థానానికి పరిమితం**



కరీంనగర్, ఫిబ్రవరి 13 (మనప్రజాప్రతినిధి): తెలంగాణ మున్సిపల్ ఎన్నికల ఫలితాల్లో రాష్ట్రవ్యాప్తంగా కాంగ్రెస్ హవా కొనసాగుతున్నప్పటికీ, కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్‌లో మాత్రం కమలం వికసించింది. మొత్తం 66 డివిజన్లలో జరిగిన పోటీలో భారతీయ జనతా పార్టీ 33 స్థానాలు గెలుచుకుని సింగిల్ లార్జెస్ట్ పార్టీగా అవతరించింది. కాంగ్రెస్ 12, భారత రాష్ట్ర సమితి 9, ఆల్ ఇండియా మజ్లిస్-ఎ-ఇత్తెహాదుల్ ముస్లిమీన్ 7, ఇతరులు 5 స్థానాలకు పరిమితమయ్యారు. మేయర్ పీఠానికి అవసరమైన మేజిక్ ఫిగర్ 34 కాగా, బీజేపీ 33 స్థానాలతో మెజారిటీకి ఒక్క అడుగు దూరంలో నిలిచింది. ఈ నేపథ్యంలో స్థానిక ఎంపీ, కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ ఎక్స్‌ఆఫీషియో ఓటు బీజేపీకి కీలకంగా మారింది. ఆ ఓటుతో బీజేపీ బలం 34కు చేరడంతో ఎటువంటి ఇతర పార్టీల మద్దతు అవసరం లేకుండానే మేయర్ పీఠాన్ని కైవసం చేసుకుంది. గతంలో అధికారంలో ఉన్న బీఆర్ఎస్ మూడో స్థానానికి పడిపోవడం గమనార్హం. కాంగ్రెస్ తన బలాన్ని పెంచుకున్నప్పటికీ బీజేపీ జోరును అడ్డుకోవడంలో విఫలమైంది. ఈ ఫలితాలతో కరీంనగర్ మరోసారి బీజేపీకి బలమైన కంచుకోటగా నిలిచిందని పార్టీ శ్రేణులు వ్యాఖ్యానిస్తున్నాయి.ఎన్నికల ప్రచారంలో బండి సంజయ్ నిర్వహించిన కార్యక్రమాలు, అభివృద్ధి నినాదాలు ఓటర్లను ఆకట్టుకున్నాయని పార్టీ నాయకులు చెబుతున్నారు. పాత నగర ప్రాంతాల్లోనూ బీజేపీ గట్టి పోటీ ఇచ్చి స్థానాలు గెలుచుకోవడం విశేషంగా మారింది. ఈ విజయంతో ఉత్తర తెలంగాణ రాజకీయాల్లో బీజేపీ బలాన్ని మరోసారి చాటుకున్నట్లు విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

# నల్గొండలో కాంగ్రెస్ చారిత్రాత్మక విజయం కోమటిరెడ్డి

**-48 వార్డుల్లో 27 కాంగ్రెస్ ఖాతాలో**
**-హైదరాబాద్‌కు దీటుగా నల్గొండ అభివృద్ధి హామీ**
**-వారానికి రెండు రోజులు ప్రజలకు అందుబాటులో ఉంటానని ప్రకటన**



నల్గొండ, ఫిబ్రవరి 13 (మనప్రజాప్రతినిధి): నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధించిన నేపథ్యంలో రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. కాంగ్రెస్‌కు అఖండ మెజారిటీ కట్టబెట్టిన నల్గొండ ప్రజలకు ఆయన హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డి నాయకత్వంలో కొనసాగుతున్న ప్రజా పాలనకు ఈ గెలుపు నిదర్శనమని పేర్కొన్నారు. మొత్తం 48 వార్డుల్లో కాంగ్రెస్ 27 స్థానాలు గెలుచుకోగా, భారత రాష్ట్ర సమితి 9, భారతీయ జనతా పార్టీ 4, ఇతరులు 8 స్థానాలు దక్కించుకున్నారు. ఈ ఫలితాలతో నల్గొండలో కాంగ్రెస్ స్పష్టమైన ఆధిక్యాన్ని ప్రదర్శించింది. "నల్గొండ అంటే కాంగ్రెస్... కాంగ్రెస్ అంటే నల్గొండ" అని ప్రజలు మరోసారి నిరూపించారని మంత్రి వ్యాఖ్యానించారు.గెలుపొందిన కార్పొరేటర్లు ప్రజల ఆశయాలకు అనుగుణంగా పనిచేయాలని సూచిస్తూ, ఓటమి చెందిన అభ్యర్థులు నిరుత్సాహపడవద్దని అన్నారు. తమ డివిజన్లలోని సమస్యలను నేరుగా తన దృష్టికి తీసుకురావాలని కోరారు. రాజకీయాలకు అతీతంగా ప్రజా



సమస్యల పరిష్కారమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. ఇకపై వారానికి రెండు రోజులు నల్గొండలోనే అందుబాటులో ఉంటానని మంత్రి ప్రకటించారు. ప్రతి డివిజన్‌లో ప్రజా దర్బార్ నిర్వహించి క్షేత్రస్థాయిలో సమస్యలను తెలుసుకుని వెంటనే పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ప్రజలు ఉంచిన విశ్వాసాన్ని నిలబెట్టుకుంటూ ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తామని కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి భరోసా ఇచ్చారు.

# ప్రశాంతంగా పురపాలక ఎన్నికల కౌంటింగ్.....



మన ప్రజా ప్రతినిధి తెలుగు దినపత్రిక ఖమ్మం జిల్లా:ఖమ్మం జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ప్రియదర్శిని కళాశాలలో ఏర్పాటు చేసిన ఏదులాపురం మున్సిపల్ కౌంటింగ్ సెంటర్ లో కౌంటింగ్ ప్రక్రియను పరిశీలించిన జిల్లా కలెక్టర్ ఖమ్మంజిల్లాలోని 5 మున్సిపాలిటీలకు సంబంధించి కౌంటింగ్ ప్రక్రియ ప్రశాంతంగా ముగిసిందని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు.జిల్లా కలెక్టర్ ప్రియదర్శిని కళాశాలలో ఏర్పాటు చేసిన ఏదులాపురం మున్సిపల్ కౌంటింగ్ సెంటర్ లో గురువారం కౌంటింగ్ ప్రక్రియను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. అనంతరం కలెక్టరేట్ లో ఏర్పాటు చేసిన వెబ్ కాస్టింగ్ మానిటరింగ్ సెల్ నుండి అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ తో కలిసి 5 మునిసిపాలిటీల కౌంటింగ్ ప్రక్రియను పర్యవేక్షించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూలి ఖమ్మం జిల్లాలో మధిర, సత్తుపల్లి, ఏదులాపురం, వైరా, కల్లూరులో ఉదయం 8 గంటలకు కౌంటింగ్ ప్రక్రియ ప్రారంభమైందని తెలిపారు. ప్రతి మున్సిపాలిటీ పరిధిలో 2 రౌండ్ ల చొప్పున కౌంటింగ్ ప్రక్రియ పారదర్శకంగా చేపట్టి ఫలితాలు ప్రకటించామని అన్నారు.ఈ కార్యక్రమంలో డిఆర్ఓ ఏ. పద్మశ్రీ, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ మున్సిపల్ పోరులో కాంగ్రెస్ ప్రభంజనం

**- 116 మున్సిపాలిటీల్లో కాంగ్రెస్ ఖాతాలో 66 స్థానాలు**
**- 2,582 వార్డుల్లో 1,347 స్థానాలు హస్తం వశం**
**- 13 మున్సిపాలిటీలతో రెండో స్థానంలో బీఆర్ఎస్**
**- 37 చోట్ల హంగ్.. చైర్మన్ పీఠాలపై ఉత్కంఠ**



హైదరాబాద్, ఫిబ్రవరి 13 (మనప్రజాప్రతినిధి): తెలంగాణ మున్సిపల్ ఎన్నికల ఫలితాల్లో అధికార కాంగ్రెస్ పార్టీ ప్రభంజనం సృష్టించింది. శాసనసభ ఎన్నికల తర్వాత జరిగిన ఈ కీలక పోరులో మెజారిటీ మున్సిపాలిటీలు, కార్పొరేషన్లను కైవసం చేసుకుని రాష్ట్రవ్యాప్తంగా తన రాజకీయ పట్టు నిలబెట్టుకుంది. ప్రజా సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలపై ప్రభుత్వం చేపట్టిన చర్యలకు ప్రజలు మద్దతు తెలిపినట్లుగా ఈ ఫలితాలు స్పష్టంచేస్తున్నాయి.ఇప్పటివరకు వెలువడిన ఫలితాల ప్రకారం రాష్ట్రంలోని 116 మున్సిపాలిటీల్లో కాంగ్రెస్ ఏకంగా 66 చోట్ల విజయం సాధించింది. మొత్తం 2,582 వార్డులకు గాను 1,347 వార్డుల్లో హస్తం గుర్తు అభ్యర్థులు గెలుపొందారు. ప్రధాన ప్రతిపక్షంగా ఉన్న భారత రాష్ట్ర సమితి 13 మున్సిపాలిటీలు, 717 వార్డులతో రెండో స్థానానికి పరిమితమైంది. భారతీయ జనతా పార్టీ 261 వార్డుల్లో, స్వతంత్ర అభ్యర్థులు 256 వార్డుల్లో విజయం సాధించారు.మరో 37 మున్సిపాలిటీల్లో ఏ పార్టీకి స్పష్టమైన మెజారిటీ రాకపోవడంతో హంగ్ పరిస్థితి నెలకొంది. ఈ ప్రాంతాల్లో చైర్మన్ పదవుల కోసం స్వతంత్రులు, చిన్నపార్టీల మద్దతు కీలకంగా మారనుంది. రాజకీయ సమీకరణాలు వేగంగా మారే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు.



మహబూబ్‌నగర్ జిల్లా వడ్డేపల్లి మున్సిపాలిటీని ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ గెలుచుకోవడం ప్రత్యేకంగా నిలిచింది. కార్పొరేషన్లలోనూ కాంగ్రెస్ హవా స్పష్టంగా కనిపించింది. మంచిర్యాల, రామగుండం, నల్గొండ కార్పొరేషన్లను కాంగ్రెస్ కైవసం చేసుకుంది. ఇంకా పలు చోట్ల ఓట్ల లెక్కింపు కొనసాగుతుండగా పూర్తి స్థాయి ఫలితాలు వెలువడాల్సి ఉంది. ఈ ఎన్నికల ఫలితాలు రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలపై కూడా ప్రభావం చూపే అవకాశముంది. తెలంగాణ రాజకీయాల్లో కాంగ్రెస్ ఆధిపత్యం మరింత బలపడిందని ఈ ఫలితాలు సూచిస్తున్నాయి.

# మసీదు భూమి నమోదు కోసం లంచం డిప్యూటీ తహసీల్దార్ అరెస్ట్

**-రూ.10 వేల లంచం తీసుకుంటూ పట్టుబడ్డ అధికారి**
**-పులివెందుల ఆర్డీవో కార్యాలయంలో ఏసీబీ దాడి**
**-మసీదు 36 ఎకరాల భూమి ఆన్‌లైన్ నమోదు వివాదం**



అమరావతి, ఫిబ్రవరి 13 (మన ప్రజాప్రతినిధి): మసీదుకు చెందిన భూమిని ఆన్‌లైన్‌లో నమోదు చేసేందుకు లంచం తీసుకున్న డిప్యూటీ తహసీల్దార్‌ను ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. కడప జిల్లా పులివెందుల ఆర్డీవో కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్‌గా పనిచేస్తున్న నాగేంద్రప్రసాద్ రూ.10 వేల లంచం స్వీకరిస్తుండగా అధికారులు దాడి చేసి అరెస్ట్ చేశారు. చక్రాయపేట మండలం కుమారకాల్వ గ్రామంలో మసీదుకు చెందిన 36 ఎకరాల భూమి ఉందని, ఈ భూమిని ఆన్‌లైన్‌లో నమోదు చేయాలంటూ మసీదు కమిటీ సభ్యులు అధికారులను సంప్రదించినట్లు సమాచారం.



అయితే భూమి నమోదు ప్రక్రియ పూర్తి చేయాలంటే లంచం ఇవ్వాలని నాగేంద్రప్రసాద్ డిమాండ్ చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. బాధితుడు కరీముల్లా ఏసీబీ అధికారులను ఆశ్రయించడంతో పన్నిన ఉచ్చులో అధికారి చిక్కుకున్నాడు. శుక్రవారం ఆర్డీవో కార్యాలయంలో లంచం తీసుకుంటున్న సమయంలో ఏసీబీ డీఎస్పీ సీతారామారావు ఆధ్వర్యంలో అధికారులు దాడి చేసి పట్టుకున్నారు. పట్టుబడ్డ అధికారిపై కేసు నమోదు చేసి విచారణ కొనసాగిస్తున్నట్లు ఏసీబీ అధికారులు తెలిపారు. ఈ ఘటనతో రెవెన్యూ శాఖలో కలకలం రేగింది.